పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి

నివాళులర్పిస్తున్న వివేక్, తదితరులు

చిక్కడపల్లి, మే 19 : వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య పార్కులోని ఆయన విగ్రహం వద్ద వాకర్స్ నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. వివేక్, బి. వెంకటేశ్, స్వామిగౌడ్ మాట్లాడారు. గభూషణం, మాజీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కిషన్‌రావు, రవి కుమార్, సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆంజయ్య, స్కైలాబ్‌బాబు, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌లో.. రేపు క్విజ్ పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 19 : జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా 21న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని కూకట్‌పల్లి జడ్సీ అభిలాష తెలిపారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలోని 44 కేంద్రాల్లో నిర్వహించే క్యాంపుల్లో 4వేల మంది విద్యార్థులు క్రీడానైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారని తెలిపారు. దీనిలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంగళవారం (ఈ నెల 21న) కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని జీహెచ్ఎంసీ క్రీడా ప్రాంగణంలో ఉదయం 7 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. సమ్మర్ కోచింగ్‌లో పాల్గొన్న వారు(6 నుంచి 16 ఏండ్లు) అర్హులని తెలిపారు. కోచ్ అంజి బాబు (9652777713), సహాయక కోచ్ వెంకట్‌రావు (9908770800) సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని జడ్సీ తెలిపారు.

26 నుంచి శృంగేరి శారదా శంకమఠం వార్షికోత్సవాలు

అల్లాపూర్, మే19 : మోతీనగర్ పరిధిలోని శ్రీ శృంగేరి జగద్గురు మహా సంస్థానం శ్రీ శృంగేరి శారదా శంకర మఠం 25వ వార్షికోత్సవాలు 26 ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి సీఎస్ఆర్ మూర్తి ఆదివారం తెలిపారు. మొదటిరోజు ఆదివారం ఉదయం 7 గంటలకు గురువందనం, గురుపాదుకా పూజ, శ్రీ ఆది శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన,గణపతి పూజ కలశస్థాపన, 10 గంటలకు శ్రీలక్ష్మి గణపతి హోమంతో పూజలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

మహిళలకు అవగాహన కల్పిస్తున్న పొదుపు సంఘాల ప్రతినిధులు

జూబ్లీహిల్స్, మే 19: రోడ్డుపై చెత్త వేస్తే మహిళా సంఘాల సభ్యులు పట్టుకుంటారని.. రోడ్లపై వ్యర్థాలు వేసే వారు జరిమానా కట్టక తప్పదని యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు పేర్కొన్నారు. ప్రతిఇంటి నుంచి చెత్తను స్వచ్ఛ ఆటోల కార్మికులకే ఇవ్వాలని అన్నారు. రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్ఎంసీ శానిటేషన్, పొదుపు సంఘాల మహిళలతో శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. చెత్త రోడ్లపై వేస్తే రూ.10వేల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి

ఎర్రగడ్డ, మే 19: అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మోతీనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ పరిరక్షణ కమిటీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత బొట్టుశివతో పాటు పలువురు బాబాసాహెబ్ విగ్రహ పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ఓం శ్రీసాయిరాం బాధితులకు న్యాయం చేయాలి

- ఫైనాన్స్ యజమాని సాయిబాబాను తక్షణమే అరెస్టు చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

బాధితులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

రవీంద్రభారతి, మే 19 : ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, లేకపోతే ఎమ్మెల్యేలను, మంత్రులను గ్రామాల్లో తిరగనివ్వమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు(రాజ్యసభ సభ్యుడు)ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుతాన్ని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆర్. కృష్ణయ్య బాధిత ప్రజలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన 50 గ్రామాల ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలను ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీ అధిక వడ్డీ ఆశ చూపి నట్టేట ముంచిందని, దాదాపు రూ.150 కోట్లు పేదల సొమ్మును ఫైనాన్స్ యజమాని దోచుకున్నారని ధ్వజమెత్తారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం డబ్బులను ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ యజమాని బాధిత ప్రజలను నుంచి అధిక వడ్డీ ఆశ చూపి రూ.150 కోట్లు తీసుకున్నారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. కొన్ని నెలల తరువాత అవసరాల కోసం బాధిత ప్రజలు డబ్బులు ఇవ్వాలని సాయిబాబాను అడుగగా రేపిస్తా.. మాపిస్తా.. అని ప్రజలను మభ్య పెట్టారని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బాధితులు దబాయించి అడుగగా 'నా దగ్గర డబ్బులు లేవని, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బాధితులను బెదిరించాడని తెలిపారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు, రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ధ్వజమెత్తారు.

సీఎం తక్షణమే స్పందించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి బాధితులకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఫైనాన్స్ యజమాని సాయిబాబాను పోలీసులు అరెస్టు చేసి అతని పేరుమీద ఉన్న బీనామీ ఆస్తులను జప్తు చేసి బాధితులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకుంటే మంత్రులు, ఎమ్మెల్యేల ఇంటిముందు బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తానని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆయన వెంట 50 గ్రామాల బాధిత ప్రజలు ఉన్నారు.

విజేతగా నిలిచిన సనత్‌నగర్ బాలికల జట్టు

సత్తా చాటిన సనత్‌నగర్ బాస్కెట్ బాల్ జట్లు

.అమీర్‌పేట్, మే 19: నగరంలోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో జరుగుతున్న వేసవి క్రీడా శిబిరాల్లో భాగంగా నిర్వహించిన ఇంటర్ ప్లే గ్రౌండ్ టోర్నమెంట్ – 2024లో సనత్‌నగర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సత్తాచాటారు. నగర నలుమూలల నుంచి వచ్చిన జట్లతో పోటీ పడుతూ అండర్–16 బాలికల సనత్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. కాగా, ఈ పోటీల్లో సనత్‌నగర్ బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. సనత్‌నగర్ బాస్కెట్ బాల్ గ్రౌండ్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సనత్‌నగర్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి విష్ణు కుమార్, కోచ్ నయీమ్‌లు విజేత జట్ల సభ్యులను అభినందించారు.

ద్వితీయ స్థానంలో నిలిచిన బాలుర జట్టు

బాల మురుగన్ విగ్రహ ప్రతిష్ఠాపన

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ పరిధిలో బాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం జరిగింది. తమిళ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట స్వామి అధ్యక్షతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో మొదటి రోజు స్వామివారి ఊరేగింపు, రెండోరోజు హోమాలు చేసి మూడోరోజు విగ్రహ ప్రతిష్ఠాపన చేసి.. డాక్టర్ ఎమ్.మురళీధరన్ వివాదియార్, డాక్టర్ ఎన్. రాజు సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో నాయకులు, తమిళ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కోట స్వామి, ఉపాధ్యక్షులు ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె. చిన్నస్వామి, ట్రెజరర్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్. ఆనందం, తమిళ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- జీడిమెట్ల, మే 19

నిరుపయోగంగా వేగ నియంత్రణ సూచిక బోర్డు

బంజారాహిల్స్, మే 19: అతివేగంతో వెళ్లే వాహనదారులను కట్టడి చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రయోగాత్మక విధానాలు కొత్త ప్రభుత్వంలో నీరుగారుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నం–2లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ రోడ్డులో అత్యంత వేగంగా వాహనాలు వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తించిన ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ రోడ్డులో ఎలక్ట్రానిక్ స్పీడ్ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. రోడ్డు మీద వెళ్తున్న వాహనాల వేగాన్ని లెక్కించే ఈ డిస్‌ప్లేలో నమోదవుతున్న వేగాన్ని ట్రాఫిక్ విభాగం సీసీ కెమెరాలతో అనుసంధించాలని గతంలో అధికారులు వీటిని ఏర్పాటు చేశారు. నాలుగైదు నెలలు బాగానే పనిచేసిన ఈ డిస్‌ప్లే.. ఇటీవల పనిచేయడం మానేసింది. దీని నిర్వహణపై ఎవరూ దృష్టి పెట్టకపోవడంతో నిరుపయోగంగా మారింది.

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్‌లో నిరుపయోగంగా మారిన డిస్‌ప్లే బోర్డు

పద్మారావుగౌడ్‌కు సన్మానం



బీఆర్ఎస్ నాంపల్లి కార్యాలయంలో పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, తదితరులు

మెహిదీపట్నం మే 19 : నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేయించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని పద్మారావు గౌడ్ అభినందించారు. అనంతరం పద్మారావుగౌడ్‌ను ఆనంద్‌కుమార్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, ప్రియాంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు

ఉత్సవాలను ప్రారంభించిన విశ్రాంత జస్టిస్ కాశీవిశ్వేశ్వరావు

ముషీరాబాద్, మే 19: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత జస్టిస్ కాశీవిశ్వేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన గొప్ప తత్వవేత్త ఆది శంకరాచార్య అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాట్యగురువు ఎస్‌పీ భారతి, ఉష, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

25న అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

అంబర్‌పేట, మే 19: 32 వేల సంకీర్తనలు రచించిన తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమమీ డైరెక్టర్ వసుధామూరి తెలిపారు. హైటెక్‌సిటీ, మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయంత్రం ఐదు గంటల నుంచి జరిగే ఈ ఉత్సవాలకు నటుడు, మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రదీప్, యాంకర్ సరస్వతి ప్రదీప్, డాన్సర్, నటీ ఆశ్రిత వేముగంటి నండూరి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోశ్యభట్ల తదితరులు అతిథులుగా విచ్చేస్తున్నారని చెప్పారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు లక్ష్మణ మూర్తి పర్యవేక్షణలో 100 మందికిపైగా అన్నమయ్య కీర్తనల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నారన్నారు. వంద మంది విద్యార్థులు పాటలు పాడుతుంటే శాలిని అమరనేని, కనకహర్షిణి కూచిపూడి నృత్యరూపకం ఉంటుందని ఈవెంట్ మేనేజర్లు నందిని, యామినిలు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8374927736 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రతి ఒక్కరికి ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

స్టార్ హాస్పటల్స్, అమీర్‌పేట కమ్మ సామాజిక సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

జూబ్లీహిల్స్, మే 19: ప్రతి ఒక్కరికీ తమ ఆరోగ్యంపై అవగాహన అవసరమని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని స్టార్ హాస్పిటల్ వైద్య నిపుణులు సూచించారు. బంజారాహిల్స్ స్టార్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో అమీర్‌పేట్‌లోని కమ్మ సామాజిక సంఘం సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్టార్ హాస్పిటల్స్ ద్వారా అవసరమైన వారికి ఉచితంగా ఆరోగ్య అవగాహన, స్క్రీనింగ్ వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో కార్డియాలజీ, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో, లివర్, జనరల్ మెడిసిన్, న్యూరో సైన్సెస్, నెఫ్రాలజీ, ఆంకాలజీ, ఆర్థోపెడిక్స్, పల్మనాలజీ విభాగాల సూపర్ స్పెషలిస్ట్ వైద్య నిపుణులతో ఉచిత కన్సల్టేషన్ సేవలందించారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్) తనిఖీ, బ్లడ్ ప్రెజర్ (బీపీ) పర్యవేక్షణ వంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈసీజీ, కార్డియాలజిస్ట్ సలహా ప్రకారం 2డీ ఎకో, ఆడియోమెట్రీ, ఫైబ్రో స్కాన్, బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ) పరీక్ష, 40 ఏండ్లు పైబడిన మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు, పురుషులు, మహిళలు, ధూమపానం చేసేవారికి ఓరల్ క్యాన్సర్ కోసం స్క్రీనింగ్‌లతో పాటు శ్వాసకోస ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి పల్మనాలజిస్ట్‌ల సిఫారసుల ఆధారంగా స్పిరోమెట్రీ పరీక్షలు కూడా నిర్వహించబడ్డాయి. సాగర్ హాస్పిటల్స్ నిరంతరం ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణలో నిబద్ధతతో సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో 1200 మందికి పైగా పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, మందులు, కన్సల్టేషన్, సలహాలు పొందారు. కార్యక్రమంలో గ్రూప్ సీఓఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ అనూష (ఆంకాలజీ), డాక్టర్ జ్యోత్స్న (నెఫ్రాలజిస్ట్), డాక్టర్ రామాంజనేయులు (గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్), డాక్టర్ నిహారిక (న్యూరాలజిస్ట్), డాక్టర్ కిషోర్ (ఈఎన్‌టీ), డాక్టర్ అనూరాధ (పల్మనాలజిస్ట్) తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్య కారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన విశ్వశిఖర నాట్యాలయ భరతనాట్య గురువులు మీనా, కృష్ణ ప్రియ తమ శిష్య బృందంతో కలిసి నర్తించారు. – కొండాపూర్

ఎల్లమ్మ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం అందజేసిన ఆలయకమిటీ సభ్యులు, పురోహితులు

బేగంపేట్, మే 19: జూలై 9వ తేదీన జరగబోయే బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవానికి రావాలంటూ, ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆదివారం మారేడుపల్లిలోని నివాసంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పురోహితులు కల్యాణం ఏర్పాట్ల గురించి ఆయనకు వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యే తలసాని సూచించారు.

హరిప్రసాద్ మృతి బాధాకరం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



హరిప్రసాద్ సంతాప సభలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట్, మే 19: ఇటీవల మృతి చెందిన అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు హరిప్రసాద్ సంతాప సభ ఆదివారం అమీర్‌పేట్ వివేకానంద కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హరిప్రసాద్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా హరిప్రసాద్‌కు చక్కటి గుర్తింపు ఉందన్నారు. ప్రజా సమస్యలపై స్పందించే గుణమున్న హరిప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. హరిప్రసాద్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషు కుమారి, బీఆర్ఎస్ నాయకులు అశోక్ యాదవ్, సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, హరిసింగ్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసిన స్కై ఫౌండేషన్ సభ్యులు

బన్సీలాల్‌పేట్, మే 19: పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పాదచారులకు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి కాలంలో నగరంలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తాము ముఖ్య కూడళ్లలో ప్రతి వారం మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్నామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని, అన్ని ప్రధాన కూడళ్లలో, బస్టాండ్లలో, చేంజ్ ఓవర్ పాయింట్లలో చల్లటి తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వారన్నారు. కీర్తి, మానస, కోమల్, అఖిల్, శుభం తదితరులు పాల్గొన్నారు.

'పరిశోధనలో సృజనాత్మకత- ఆవిష్కరణలు' పై సదస్సు

సదస్సుకు హాజరైన ప్రతినిధులు

అమీర్‌పేట్, మే 19: అమీర్‌పేట్‌లోని హోటల్ ఆదిత్య పార్క్‌లో 'పరిశోధనలో సృజనాత్మకత – ఆవిష్కరణలు' అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ముగిసింది. బెస్ట్ వీసీ ఛాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ విభాగం సీ–డీఏసీ సెంటర్ హెడ్ శాస్త్రవేత్త డాక్టర్ పీఆర్ లక్ష్మి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరై వివిధ రంగాలలో జరిగే పరిశోధనల్లో సృజనాత్మకతను చేర్చడం, సీ–డీఏసీ విధుల గురించి నొక్కి చెప్పారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 110 కళాశాలల నుంచి వచ్చిన దాదాపు 250కి పైగా రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారు. నగరానికి చెందిన అంజయ్య అనుష్క నాయక్ సమర్పించిన 'వుమెన్ అబ్జెక్టిఫికేషన్ ఇన్ మూవీస్' అనే అంశంపై సమర్పించిన థీసిస్‌తో పాటు వివిధ రంగాలకు సంబంధించి సమర్పించిన దాదాపు 250 థీసిస్‌లపై ఆయా రంగాలకు చెందిన నిపుణులు, శాస్త్రవేత్తలు లోతుగా చర్చించారు. కార్యక్రమంలో వీసీలు డాక్టర్ కె.నాగజ్యోతి, డాక్టర్ సుందరేశ్ బిలిగి పాల్గొన్నారు.

తిరుపతిరావు కమిటీ నివేదికను

వెంటనే బహిర్గతం చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య

ఉస్మానియా యూనివర్సిటీ, మే 19 : ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలపై నియమించిన ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికను వెంటనే బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. ఈ అక్రమాల వివరాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు ఇప్పటికే నివేదించామని చెప్పారు. వారిని వీసీలుగా నియమించే విషయంలో జాగ్రత్త వహించాలని కోరారు. ఓయూ వీసీగా ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ బాధ్యతలు తీసుకున్న తరువాత అధ్యాపకులకు మూడు సార్లు కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద పదోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. 51 మందికి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చారని చెప్పారు. వారికి అనుకూలంగా ఉన్న ప్రొఫెసర్లకు యూజీసీ, వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన తిరుపతిరావు కమిటీ పలుమార్లు సమావేశమై నివేదిక సమర్పించిందని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆ నివేదికను బహిర్గతం చేయలేదని అన్నారు. తక్షణమే కమిటీ నివేదికను బహిర్గతం చేసి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో వారిని వీసీలుగా నియమిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.